క్లుప్తంగా

బార్ అసోసియేషన్ తరఫున జిల్లా జడ్జికి సన్మానం


సన్మానం చేస్తున్న దృశ్యం

రాయదుర్గం: జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ ఆదివారం రాయదుర్గం పర్యటనకు వచ్చిన సందర్భంగా స్థానిక కోర్టు హాలులో జూనియర్ సివిల్ జడ్జి లావణ్య ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ సభ్యులు పూలమాల వేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆయన వెంట వచ్చిన ఎస్పీ డాక్టర్ పక్కీరప్ప, న్యాయసేవా సంస్థ జిల్లా కార్యదర్శి దీనబాబు, కళ్యాణదుర్గం జడ్జి బి సుభాన్, ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ యుగంధర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఆర్‌టీ జగన్‌మోహన్‌రెడ్డి, వెంకటరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రాజేష్, వన్నూర్ స్వామి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కూడేరు: అధికారులు స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి ప్రాజెక్టుల కార్మికులు కోరారు. ఆదివారం మూడో రోజు మండలంలోని పీఏబీఆర్ డ్యాం వద్ద ఉన్న సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి ప్రాజెక్టు కార్యాలయం ఎదుట కార్మికులు సమ్మె కొనసాగించారు. ఆ సంఘం నేతలు మాట్లాడుతూ తమకు రావాల్సిన బోనస్ , లీవ్ ఎంగేజ్మెంట్ గ్రాట్యుటీ, పెండింగ్‌లో ఉన్న వేతనాలను ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తిప్పయ్య, నాగరాజు, శ్రీనివాసులు, రాముడు, తిప్పేస్వామి, రామచంద్ర, గోవింద రాజులు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

వజ్రకరూరు: సత్యసాయి కార్మికుల సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి విరూపాక్షి డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని సత్యసాయి రిజర్వాయర్ వద్ద సమ్మె చేస్తున్న కార్మికులకు సీపీఎం నాయకులు సంఘీభావం తెలిపారు. యూనియన్ అధ్యక్షుడు చిన్నబాబయ్య, సహాయ కార్యదర్శి లాలు, కార్మికులు కిష్టప్ప, రామాంజనేయులు, రమేష్, సంతోష్, యాకుబ్, యుగంధర్‌బాబు, సీపీఎం సహాయ కార్యదర్శి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ ఆలయ నిర్మాణానికి సంకల్పం


గ్రామపెద్దలతో కలిసి ఆలయ నిర్మాణానికి సంకల్పించిన ఉద్యోగులు

రాయదుర్గం రూరల్: ఉద్యోగుల ఖిల్లాగా ఖ్యాతి గడించిన ఆర్బీ వంక(బొందనకల్లు) తండా లో బంజారాల కులగురువు మరియమ్మాయాడి సేవాబాయి దేవళ్ (దేవాలయం) నిర్మించాలని సంకల్పించారు. గ్రామపెద్దలతో కలసి ఆదివారం గ్రామంలో ఉద్యోగులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమ వంతుగా విరాళం ఇచ్చి దేవాలయం నిర్మించాలని సంకల్పించినట్లు ఉద్యోగులు గ్రామపెద్దల దృష్టికి తీసుకెళ్లారు. వారి నిర్ణయాన్ని స్వాగతిస్తూ, మా వంతుగా సహకారం అందిస్తామని పెద్దలు హామీ ఇచ్చారు. త్వరలోనే ఈ శుభకార్యానికి శ్రీకారం చుట్టనున్నట్లు గ్రామపెద్దలు హరిశ్చంద్రనాయక్, హేమ్లానాయక్, ఝాన్సీబాయి, తిప్పేస్వామినాయక్, ఉద్యోగులు బాలాజీనాయక్, శ్రీనివాసులు నాయక్, గోపాల్‌నాయక్, వసంతనాయక్, ఎంకానాయక్, సేనానాయక్, మోహన్‌నాయక్ తదితరులు తెలిపారు.

అరటి రైతులకు తీవ్ర నష్టం

బొమ్మనహాళ్: అకాల వర్షంతో చేతికొచ్చిన అరటి పంట దెబ్బతింది. శనివారం రాత్రి కురిసిన వర్షానికి మండలంలోని పలు చోట్ల వ్యవసాయ, ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. గోవిందవాడ గ్రామంలో రైతులు ఎర్రిస్వామి, ప్రభాకర్‌కు చెందిన 12 ఎకరాల అరటి తోట పూర్తిగా దెబ్బతినింది. ఈదురు గాలులకు చేతికొచ్చిన అరటి పంట పూర్తిగా నేలకూలిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలన్నారు.

'నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది'

బొమ్మనహాళ్: అకాల వర్షాల కారణంగా నష్టపోయిన ప్రతి రైతునూ రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, సీనియర్ నేత చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు మండలంలో వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను నష్టపరిహారం అందేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. రైతులకు జగనన్న ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. మండల వ్యాప్తంగా 180 ఎకరాల్లో మిరప, 23 ఎకరాల్లో మొక్కజొన్న పంట నష్టం జరిగినట్లు వ్యవసాయధికారులు అంచనా వేశారన్నారు. వర్షాల కారణంగా ఇంకా ఎవ్వరైనా నష్టపోయిన రైతులు ఉంటే స్థానిక రైతు భరోసా కేంద్రంలోని సిబ్బందికి తెలియజేయాలన్నారు. వైస్ ఎంపీపీ రమేష్, నాయకులు ప్రసాద్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, కోటేశ్వరరెడ్డి, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత చదువులకు జగనన్న 'దీవెన'

- ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాలకు రూ.8 కోట్లకు పైగా విడుదల
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు


ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యాదీవెన కింద లబ్ధి పొందిన విద్యార్థులు

ఉరవకొండ: పేదింటి బిడ్డల ఉన్నత చదువులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక చేయూతనిస్తోంది. ప్రతి ఏటా జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాన్ని అమలు చేస్తూ విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమ చేస్తోంది. ఇప్పటికే విద్యాభ్యాసాన్ని పూర్తి చేసుకుని పలువురు ఉద్యోగాలు సాధించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దీవెనలతో తమ కుటుంబాల్లో విద్యా వెలుగులు నిండాయని పలువురు విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాలకు వరుసగా మూడో ఏడాది కూడా జగనన్న విద్యాదీవెన నిధులు విడుదలయ్యాయి. ఈ విద్యా సంవత్సరానికి 13,643 మంది విద్యార్థులకు సంబంధించి 12,241 మంది తల్లుల ఖాతాల్లోకి ప్రభుత్వం రూ. 8.07 కోట్ల నిధులు విడుదల చేసింది. ఫీజులు చెల్లించలేక పేద విద్యార్థులు చదువులను మధ్యలోనే నిలిపివేయకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా కల్పిస్తూ నిధులు విడుదల చేయడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గం	విద్యార్థుల సంఖ్య	విడుదలైన నిధులు
ఉరవకొండ	4,518	రూ.2,82,73,519
కళ్యాణదుర్గం	4,964	రూ.3,05,23,806
రాయదుర్గం	3981	రూ. 2,19,74,727
మొత్తం	13,463	రూ.8,07,72,052

జగనన్న వల్లే చదువుతున్నాం



సీఎం జగనన్న మూడేళ్ల నుంచి విద్యాదీవెన నగదు మా అమ్మ ఖాతాలో జమ చేస్తుండటం వల్ల డిగ్రీ పూర్తి చేయగలుగుతున్నాను. ప్రభుత్వ సహకారంతో ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగం సాధిస్తాననే నమ్మకం కలుగుతోంది. జగనన్నకు అండగా ఉంటాం.

– కవిత, బీకాం, ఫైనల్ ఇయర్, ఉరవకొండ

క్యాంపస్ ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయ్యా



డిగ్రీ చదవడానికి ఆర్థిక ఇబ్బందులు పడ్డాం. కానీ సీఎం జగన్ వల్ల డిగ్రీ పూర్తి చేసి క్యాంపస్ ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయ్యాను. మా చదువులకు భరోసా ఇవ్వడమే కాకుండా జీవితంలో స్థిరపడటానికి సీఎం సహకారం మరువలేనిది.

– పి.శ్రీలేఖ, బీకాం కంప్యూటర్స్, ఉరవకొండ

సీఎం రుణం తీర్చుకోలేం



కూలీ చేసుకుని బతికే మేము ఇద్దరు పిల్లలను చదివించలేకపోతున్నాం. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మా పిల్లలకు మావయ్యలా తోడ్పాటు అందించి సహాయం చేస్తున్నారు. నా కుమార్తె నూర్జహాన్ డిగ్రీ చదువుతోంది. మూడేళ్ల నుంచి నా ఖాతాలో 'విద్యాదీవెన' నగదు జమ చేస్తున్నారు. సీఎం జగన్ రుణం తీర్చుకోలేం.

– ఆర్.సలీమా, విద్యార్థిని తల్లి, ఉరవకొండ

పేద విద్యార్థులకు భరోసా



రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విద్యాదీవెన ద్వారా విద్యార్థుల ఖాతాల్లో జమ చేస్తున్న ఫీజు మొత్తాలను సంబంధిత కళాశాలల్లో నిర్ణీత సమయంలోగా చెల్లించేలా చర్యలు తీసుకుంటాము. అర్హులైన విద్యార్థులందరికీ ఈ పథకం కింద ఫీజులు విడుదల అయ్యాయి. ప్రభుత్వం పేద, మధ్యతరగతి వర్గాల పిల్లల ఉన్నత చదువులకు భరోసా కల్పిస్తోంది.

– రామ్మోహన్, సాంఘిక సంక్షేమ శాఖ సహాయ అధికారి, ఉరవకొండ

ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

బెళుగుప్ప: ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రతి ప్రైవేటు పాఠశాలలో 25 శాతం మంది పేద విద్యార్థులకు ఉచిత విద్యాబోధనకు సంబంధించి 2023–24కు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి మల్లారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉచిత విద్య 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉంటుందన్నారు. వెనుకబడిన కులాల కుటుంబాల పిల్లలు, దివ్యాంగులు, అనాథలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ నెల 22 నుంచి ఏప్రిల్ 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జిల్లా అధికారుల పరిశీలన అనంతరం లాటరీ ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. అవకాశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

25న కంటి వైద్య శిబిరం

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 25న ఉదయం 8 గంటల నుంచి ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి ఆదివారం తెలిపారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, బ్రాహ్మణి సోషల్ వెల్ఫేర్, రూరల్ డెవలప్‌మెంట్, ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహిస్తారని, ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి విచ్చేస్తారన్నారు. గ్రామీణులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయండి


శ్రీరామనవమి వేడుకలకు విశ్వేశ్వరరెడ్డిని ఆహ్వానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వజ్రకరూరు: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి, సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే కార్యాలయంలో వజ్రకరూరు మండలం పీసీ ప్యాపిలి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారికి సూచించారు. పార్టీని గ్రామస్థాయిలో మరింత పటిష్టపరచాలన్నారు.

శ్రీరామనవమి వేడుకలకు ఆహ్వానం..

మండలంలోని పీసీ పెద్దప్యాపిలిలో ఈనెల 29 నుంచి రెండు రోజులపాటు జరుగనున్న శ్రీరామనవమి వేడుకలకు హాజరుకావాలని మాజీ ఎమ్మెల్యేను వైఎస్సార్‌సీపీ నాయకులు ఆహ్వానించారు. వేడుకలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌ఓ తేజేశ్వరరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి ప్యాపిలి కిష్టప్ప, సచివాలయ కన్వీనర్ సత్యనారాయణ, స్థానిక నాయకులు రమేష్, రాఘవేంద్రస్వామి, ప్యాపిలి వీరా, అర్జున్, భీమా తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాలకు నిధులు కేటాయించండి


దేవదాయ శాఖ మంత్రి సత్యనారాయణతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

ఉరవకొండ: నియోజకవర్గంలోని దేవాలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ఆదివారం అమరావతిలో కలిసి విన్నవించారు. మంత్రిను కలసిన అనంతరం ముఖ్యమైన అంశాలను స్థానిక విలేకరులకు ఎమ్మెల్సీ ఫోన్ ద్వారా వివరించారు. పెన్నహోబిళం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో భక్తుల వసతి కోసం 25 గదులు, నాలుగు హాళ్లు కలిపి మొత్తం రెండు అంతస్తుల డార్మెంటరీని టీటీడీ ఆధ్వర్యంలో శ్రీవాణి ట్రస్టు ద్వారా నిర్మించాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి నిర్మాణ వ్యయాలను కూడా అందజేశానన్నారు. వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి పెద్ద తాండా గ్రామ సమీపాన భద్రంపల్లి ఆంజనేయస్వామి ఆలయం నిర్మించడానికి దేవదాయ శాఖ సీజీ ఫండ్ ద్వారా రూ.60 లక్షలు మంజూరు చేసిందని, అలాగే ఉరవకొండ మండలం చిన్నముస్టూరు ఆంజనేయస్వామి ఆలయం నిర్మాణానికి కూడా సీజీ ఫండ్ ద్వారా 27.5 లక్షలు మంజూరైందన్నారు. ఈ రెండు ఆలయాలకు ఆయా కమిటీ సభ్యులు 20 శాతం మ్యాచింగ్ గ్రాంట్ కట్టాల్సి ఉందన్నారు. అంత సొమ్ము కమిటీ సభ్యులు చెల్లించలేరని, మ్యాచింగ్ గ్రాంట్‌ను 20 శాతం నుంచి 10 శాతానికి తగ్గించాలని కోరారు. ఇందుకు మంత్రి స్పందించి మ్యాచింగ్ గ్రాంట్‌ను 10 శాతానికి తగ్గిస్తూ త్వరలో ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు ఎమ్మెల్సీకి హామీ ఇచ్చారు.

గ్రామాల్లో చురుగ్గా సామాజిక తనిఖీ


ఉపాధి కూలీల నుంచి వివరాలు సేకరిస్తున్న డీఆర్పీ చెన్నయ్య

వజ్రకరూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో 16వ సామాజిక తనిఖీలు చురుగ్గా సాగుతున్నాయి. ఆదివారం వజ్రకరూరు, చిన్నహోతురు, కమలపాడు, పందికుంట, గడేహోతురు, పీసీ.ప్యాపిలి, పాతకడమలకుంట, కొనకొండ్ల, తట్రకల్లు తదితర గ్రామాల్లో 2021 ఏప్రిల్ 1 నుంచి 2022 మార్చి 31వ తేదీ వరకూ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ఉపాధి పనులు తదితర వాటిపై తనిఖీలు నిర్వహిస్తున్నారు. మొత్తం రూ.15.62 కోట్లతో చేపట్టిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. ఉపాధి పథకం కింద డకౌట్స్, హార్టికల్చర్, కందకాలు తదితర వాటితో పాటు పంచాయతీరాజ్ కింద చేపట్టిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ కేంద్రాలు, బల్క్‌మిల్క్ కేంద్రాలు, వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీ కేంద్రాలు, పాఠశాలల ప్రహరీ, ఆర్‌డబ్ల్యూఎస్ పథకం కింద సీసీ ఓపెన్ డ్రైనేజీ తదితర పనులను తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్టేట్ రిసోర్స్‌పర్సన్ తులసీనాయక్, సీనియర్ డీఆర్పీ చెన్నయ్య మాట్లాడుతూ ఈనెల 23 వరకూ గ్రామాల్లో తనిఖీలు నిర్వహించిన అనంతరం వజ్రకరూరులో ఓపెన్‌ఫోరం నిర్వహిస్తామన్నారు. రెండు బృందాలుగా గ్రామాల్లో పారదర్శకంగా తనిఖీ నిర్వహిస్తున్నామన్నారు.

'కాలవ' దోపిడీ రూ.320 కోట్ల పైమాటే..!

- ఇది మేమన్నది కాదు, ఈనాడులోనే అచ్చేశారు..
- వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రూ.40 వేల కోట్లు ఇళ్లకే ఖర్చుపెట్టాం
- అసెంబ్లీలో ప్రస్తావించిన విప్ కాపు రామచంద్రారెడ్డి


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో నవరత్నాలు– పేదలందరికీ ఇళ్ల పథకం పై రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి సుదీర్ఘంగా తన వాణి వినిపించారు. ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి వివరిస్తూనే, మరో వైపు టీడీపీ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై కడిగి ఆరేశారు. గత ప్రభుత్వంలో రాయదుర్గం ప్రజల పుణ్యాన ఎమ్మెల్యేగా గెలిచి గ్రామీణ గృహ నిర్మాణశాఖ మంత్రిగా పదవి అనుభవించిన కాలవ శ్రీనివాసులు పేదల సంక్షేమాన్ని ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఒక్క రాయదుర్గంలోనే 13 వేల మందికి ఇళ్ల పట్టాలిచ్చి, 3 వేల మందికి ఇళ్లు కట్టించామన్నారు. కాలవ హయాంలో పేదల సంక్షేమాన్ని విస్మరించి దోపిడీకి ప్రాధాన్యమిచ్చారన్నారు. 'మంత్రి ఇలాకాలో.. కంత్రీలా కులాసా' అంటూ అప్పట్లో కాలవ అవినీతినిపై 'ఈనాడు'లోనే అచ్చేశారని గుర్తు చేశారు. ఒక్క ఇసుకలోనే రూ.320 కోట్లు కొల్లగొట్టాడని విప్ ఆరోపించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో నిర్మించిన ఇందిరమ్మ కాలనీల్లో మిగులు స్థలాలను సైతం టీడీపీ నాయకులు కబ్జాచేసి రూ.30 వేలు, రూ.40 వేలకు అమ్ముకున్న నీచ చరిత్ర పచ్చ నాయకులదని మండిపడ్డాడు. నియోజకవర్గంలో ఏ గ్రామానికెళ్లినా కొత్త, పాత ఊర్లుగా పిలవబడుతున్నాయంటే అది వైఎస్సార్ ఘనతేనన్నారు. ఆయన మార్గాన్ని అనుసరిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఏపీలో మాత్రమే 30.65 లక్షల మంది అక్క, చెల్లెమ్మలకు ఇళ్లపట్టాలిచ్చిన ఘనత సీఎం జగన్ కే దక్కిందన్నారు. అలాగే 21.25 లక్షలు మందికి ఇళ్లు కూడా మంజూరు చేశారన్నారు. ఇప్పటిదాకా మొదటి విడతలో రూ.25 వేల కోట్లు, రెండో విడతలో రూ.7,990 కోట్లు వెరసి రూ. 32,909 కోట్లను జగన్ ప్రభుత్వం పేదల ఇళ్ల కోసం ఖర్చుచేసిందన్నారు. ఇంటి సామగ్రి కూడా తక్కువ రేటుతో కొనుగోలు చేసి అందించామన్నారు. వడ్డీ రాయితీ ద్వారా రూ.3514 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. అలాగే రూ.3142 కోట్లు పొదుపు రుణం అందించగా, వడ్డీ రాయితీ రూ.303.28 కోట్లు జమైందని గణంకాల సహా వివరించారు.ఒక్క గృహ నిర్మాణా శాఖ ద్వారా రాష్ట్ర ప్రజలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.40 వేల కోట్లు అందించిన విషయాన్ని గుర్తుచేశారు. దేశచరిత్రలో ఇంతలా లబ్ధి చేకూర్చిన ప్రభుత్వం మరెక్కడా లేదన్నారు. గ్రామీణులకు 26 వేల కోట్ల పనిదినాలు 'ఉపాధి' కల్పించామన్నారు. అలాగే ఇళ్ల పట్టాల కోసం మరికొందరు పేదలు సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకున్నారని, వారికి పట్టాలిచ్చే బాధ్యత గృహ నిర్మాణా శాఖమంత్రి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మత్స్యకారులను ఆదుకుంటాం


మత్స్యశాఖ కమిషనర్‌తో మాట్లాడుతున్న బెస్త కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రమణ

కూడేరు: మత్స్యకారులను ఆదుకుంటామని మత్స్యశాఖ మంత్రి అప్పలరాజు, కమీషనర్ కన్నబాబు హామీ ఇచ్చారని బెస్త కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రమణ అన్నారు. ఆదివారం ఆయన విజయవాడలో వారిని కలసి మత్స్యకారులను ఆదుకోవాలని కోరారు. ఆయన మాట్లాడుతూ కూడేరు మండలంలోని పీఏబీఆర్ డ్యాంలో 2020–21లో ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన(పీఎంఎంఎస్‌వై) పథకం కింద శాటిలైట్ తిలాపియా ఫిష్ బ్రీడింగ్ సెంటర్ మంజూరైందన్నారు. ఆ పనులకు సంబంధించి టెండర్లు పిలవడానికి ఆర్జీసీఏ(రాజీవ్ గాంధీ సెంటర్ ఫర్ ఆక్వా డైరెక్టర్) నుంచి టెక్నీషియన్లను పీఏబీఆర్‌కు పంపేందుకు కృషి చేయాలని విన్నవించారు. ఆర్జీసీఏ డైరెక్టర్‌తో మాట్లాడి ఆ దిశగా చర్యలు చేపడతామని వారు హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. అలాగే జిల్లాలో బెస్త కులస్తులకు గతంలో ఇచ్చిన ఫిషర్ మెన్ లైసెన్సులను రద్దు చేయడమే కాకుండా నూతనంగా ఎవరికీ లైసెన్సులు ఇవ్వలేదని మంత్రి దృష్టికి ఆయన తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి వెంటనే డీడీ శాంతకుమారితో ఫోన్‌లో మాట్లాడి రద్దు చేసిన లైసెన్సులను పునరుద్ధరించాలని, ఇంకా అర్హత కల్గిన వారుంటే వారికి కూడా ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ కిరణ్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు


మాట్లాడుతున్న ఎంపీపీ, సర్పంచ్, ప్రజాప్రతినిధులు

ఉరవకొండ: శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో ఉరవకొండ పట్టణంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపడుతామని సర్పంచ్ లలితమ్మ, ఎంపీపీ చందా చంద్రమ్మ, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు అన్నారు. ఆదివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో వార్డు సభ్యులు, ఎంపీటీసీలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ తాగునీటి కార్మికులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో పట్టణవ్యాప్తంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తామన్నారు. నింబగల్లు ఎస్ఎస్ ట్యాంకుల ద్వారా ఏ వార్డుకు ఏ రోజు నీటిని సరఫరా చేస్తామన్న విషయం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పష్టం చేయాలన్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి కార్మికులు సమ్మె విరమించి డిమాండ్లను పరిష్కరించుకోవాలన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు తమ పబ్బం గడుపుకోవడానికి కార్మికులను రెచ్చగొట్టి సమ్మెలో ఉండేలా చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు పామిడి సలీం, బళ్లారి ఆసీఫ్, శర్మాస్, పద్మావతి, ఆటోశీనా, ప్రకాష్, హనమంతు, అన్వర్, హనమంతు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బస్సుల రాకపోకల పునరుద్ధరణ

కణేకల్లు: రాయదుర్గం–ఉరవకొండ ఆర్టీసీ బస్సు సర్వీసులను సోమవారం నుంచి పునరుద్ధరించనున్నట్లు రాయదుర్గం డిపో మేనేజర్ సురేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. కణేకల్లు–మాల్యం మార్గమధ్యంలో వేదావతి హగిరిపై నిర్మించిన రోడ్డు భారీ వర్షాలతో తెగిపోవడంతో రాయదుర్గం–ఉరవకొండ బస్సు సర్వీసులను తాత్కాలికంగా ఆపేశామన్నారు. వేదావతి హగిరిపై రోడ్డు నిర్మాణం పూర్తవడంతో సోమవారం నుంచి రాయదుర్గం–ఉరవకొండ డైరెక్ట్ సర్వీసులను నడుపుతామన్నారు. రాయదుర్గం డిపోనకు సంబంధించి ఐదు బస్సులు, ఉరవకొండ డిపోనకు చెందిన 5 బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆయన తెలిపారు. ఉరవకొండ డిపో బస్సులన్నీ ఇప్పటి వరకు మాల్యం వరకే వచ్చి వెళ్లేవన్నారు. ఇకపై ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులుండవన్నారు. కణేకల్లు–రూపనగుడి రెండు సర్వీసులు కూడా కణేకల్లు నుంచి రాకపోకలు సాగిస్తాయన్నారు. రాయదుర్గం నుంచి ఫస్ట్ బస్సు వేకువజామున 5.30 గంటలకు ఉరవకొండకు బయలుదేరుతుందని, ఉరవకొండలో ఇదే సమయానికి ఉరవకొండ డిపో బస్సు రాయదుర్గానికి బయలుదేరుతుందన్నారు. కణేకల్లు నుంచి రాయదుర్గం, ఉరవకొండ పట్టణాలకు అరగంటకో బస్సు సర్వీసు బయలుదేరుతుందన్నారు. రాత్రి 8గంటల వరకూ బస్సుల రాకపోకలు కొనసాగుతాయన్నారు.

గుండెపోటుతో మెకానిక్ మృతి

కళ్యాణదుర్గం: పట్టణ ప్రాంతానికి చెందిన ఆటో మెకానిక్ రౌఫ్(50) ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. మెకానిక్ షాపులో ఆటోకు మరమత్తు నిర్వహిస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలాడు. స్పందించిన స్థానికులు హుటాహుటిన పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే రౌఫ్ మృతి చెందినట్లు డాక్టర్ నిర్ధారించారు. మృతుడికి భార్య ఆసియాభాను, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

'ట్రబుల్' రైడింగ్

రాయదుర్గంటౌన్: అత్యసరవమో...అందరూ కలిసి వెళ్లాలనే ఆలోచనో..ఏదైతేనేం మోటారు సైకిళ్లపై ట్రిబుల్ రైడింగ్ ఇటీవల కాలంలో ఎక్కువైంది. ముఖ్యంగా యువకులు, గ్రామీణ ప్రాంత ప్రజలు తరచూ ట్రిబుల్ రైడింగ్ చేస్తున్నారు. ఈ కారణంగా ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. మరికొన్ని చోట్ల మృత్యువాత కూడా పడుతున్న ఘటనలు జరుగుతున్నాయి. ఇటువంటి ఘటనలు జరగకుండా ఉండేందుకు ట్రిబుల్ రైడింగ్‌కు ఫుల్‌స్టాప్ పెట్టాల్సిందే. అంతేకాక కొందరు వాహన చోదకులు సెల్‌ఫోన్లలో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్నారు. ఈ సమస్యలపై ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించడం లేదని పట్టణవాసులు విమర్శిస్తున్నారు. ఒక్కోసారి ఏకంగా నలుగురు యువకులు ఒకే బైక్‌పై తిరుగుతున్నారు. పట్టణంలోని ప్రధాన రహదారిపై ట్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్లలో మాట్లాడుతూ వాహనాలు నడుపుతున్న చిత్రాలు ప్రమాదాలకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి.



పట్టణంలో ట్రిబుల్ రైడింగ్ దృశ్యాలు


సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవ్ చేస్తున్న యువకుడు